సాక్షి జగిత్యాల

శుక్రవారం । 19 । ఏప్రిల్ । 2024



కీలక అవయవం.. కాలేయం

శరీరంలో జరిగే జీవ, జీర్ణక్రియల్లో కాలేయం ముఖ్య పాత్ర పోషిస్తుంది. నిరంతరం ఒక కెమికల్ ఫ్యాక్టరీ లాగా శరీరంలో పని చేస్తుంది. 8లో▸

తాగునీటికి గోస గోస..



మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి మంచినీరు ఇస్తున్నామని పాలకులు, ప్రజాప్రతినిధులంటున్నా.. రాజారాంతండా గ్రామంలో మాత్రం నీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
44.0/29.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఎండ తీవ్రత అధికమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. వేడిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

సెర్ప్ కేంద్రం తనిఖీ



మజ్జిగ ప్యాకెట్లు ఇస్తున్న అడిషనల్ కలెక్టర్

మేడిపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని, తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకి పంపాలని అడిషనల్ కలెక్టర్ రాంబాబు అన్నారు. మండలంలోని ఈదులలింగంపేట సెర్ప్ కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోళ్లపై ఆరా తీశారు. ఆకస్మికంగా వర్షం వస్తే ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎండవేడిమి అధికంగా ఉండటంతో హమాలీలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం వారికి మజ్జిగ ప్యాకెట్లు అందించారు. కట్లకుంటలో డీఆర్‌డీవో మదన్‌మోహన్ పర్యటించారు. వారితోపాటు ఏపీఎం అశోక్, వ్యవసాయ అధికారి త్రివేదిక, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి



కుమ్మరిపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

రాయికల్: ప్రధాని మోదీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పడాల తిరుపతి అన్నారు. మండలంలోని కుమ్మరిపల్లిలో గురువారం గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా మోదీ ప్రవేశపెట్టిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ధర్మపురి అర్వింద్‌ను ఎంపీగా.. మోదీని ప్రధానిగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఉడుత రవీందర్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఉడుత రాంసురేశ్, నాయకుల పంచతి నరేశ్, పాలడుగు రవీందర్, దువ్వాక నరేశ్, కొడిమ్యాల శేఖర్, నాగరాజు, పాలిక శేఖర్, పంచతి రాజు, బొమ్మకంటి రవి, కొడిమ్యాల రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల మరమ్మతు తరుచూ చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఈ సత్యనారయణ

జగిత్యాలఅగ్రికల్చర్: విద్యుత్ లైన్ల మరమ్మతు తరుచూ చేస్తూ.. సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ సిబ్బందికి సూచించారు. జిల్లాకేంద్రంలోని ఇంజినీర్స్ భవన్‌లో గురువారం విద్యుత్ లైన్ల మరమ్మతు, ప్రమాదాలు, సంస్థ అభివృద్ధిపై అంతర్గత శిక్షణ ఇచ్చారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లను సిద్ధం చేయాలని, విద్యుత్ మోటార్ల కు కెపాసిటర్లు బిగించుకునేలా చూడాలని సూచించారు. విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించేలా చూడాలన్నారు. విద్యుత్ అధికారులు తిరుపతయ్య, గంగారాం, రాజిరెడ్డి, తిరుపతి, రవీందర్, లక్ష్మణ్, నగేష్‌కుమార్, వెంకటేశ్వర్లు, జవహర్ నాయక్, హరీష్, రాజు పాల్గొన్నారు.

శ్రీరాముడికి పట్టాభిషేకం



నామాపూర్ ఆలయంలో హోమం

పెగడపల్లి: మండలంలోని నంచర్ల, నామాపూర్, ఎల్లాపూర్, అయితిపల్లిలో శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేకాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. భక్తుల శ్రీరామనామ స్మరణ మధ్య పట్టాభిషేకం కార్యక్రమాన్ని చేపట్టారు. నామాపూర్‌లో 108 హోమగుండాలతో యజ్ఞం నిర్వహించారు. రోటీగూడెం మౌనస్వామి గీతోపదేశం చేశారు. రామ భక్తులు, దీక్షాపరులు శోభాయాత్ర చేపట్టారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జెడ్పీటీసీ రాజేందర్‌రావు స్వామివారిని దర్శించుకున్నారు.



పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ఇంకుడుగుంత.. తప్పేను నీటిచింత

- ప్రతి ఇంటి ఆవరణలో 'జలసంరక్షణ' తప్పనిసరి
- ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం
- మున్సిపాలిటీల్లో ప్రారంభమైన సర్వే
- పాతదే అయినా పక్కాగా అమలుకు నిర్ణయం



జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో గతంలో నిర్మించిన ఇంకుడుగుంత

జగిత్యాల: మున్సిపాలిటీల్లో జల సంరక్షణకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఎండలు ముదిరిపోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. దీనికి విరుగుడుగా ఇంకుడుగుంతలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలన్న నిర్ణయం పాతదే అయినా.. కొద్దిరోజులుగా దీనిపై పట్టింపు కరువైంది. ఈ నేపథ్యంలో దానికి పక్కాగా అమలు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే వార్డుల్లో వ్యక్తిగత, వాణిజ్య, అపార్ట్‌మెంట్ల వారీగా సర్వే చేపడుతున్నారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఈ సర్వే కొనసాగుతోంది. ప్రధానంగా 300 చదరపు మీటర్లు కలిగిన ఇంటితోపాటు ఇతర ఏ కట్టడమైనా ఇంకుడుగుంత ఉండేలా చూడాలని ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ అధికారులు కమిటీగా ఏర్పడి సర్వే చేస్తున్నారు.

నిబంధనలు ఎక్కడ..?

గతంలోనూ ఇంటి నిర్మాణం చేపట్టుకునే వారు ఇంకుడుగుంత నిర్మిస్తేనే అనుమతి ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఇలాంటి నిబంధన ఉన్నప్పటికీ అమలులో మాత్రం ఆచరణకు లేదు. టీఎస్‌బీపాస్ చట్టం ప్రకారం ఇంటి నిర్మాణానికి అనుమతి పొందాలంటే ఆన్‌లైన్‌లో ఇంటి నిర్మాణంతోపాటు, ఇంకుడు గుంతకు సైతం ప్రత్యేక రుసుం కింద రూ.2 వేలు చెల్లించాలి. ఇంకుడు గుంతలకు డబ్బులు ప్రతిఒక్కరూ చెల్లిస్తున్నారుగానీ ఎవరూ నిర్మించడం లేదు. ఇంకుడు గుంత నిర్మిస్తే తిరిగి ఆ రూ.2 వేలు పొందే అవకాశం ఉంది. అది ఎక్కడ కూడా అమలుకు నోచుకోవడం లేదు.

మున్సిపాలిటీల్లో రుసుం

ఈ ఇంకుడు గుంతల నిర్మాణం కోసం ప్రతిఇంటి యజమాని రూ.2 వేలు చెల్లిస్తుంటారు. ఇంటి నిర్మాణం పూర్తయిన అనంతరం ఇంకుడుగుంతను చూపించి ఆ రూ.2 వేలు తీసుకునే అవకాశం ఉంది. దీనిపై సరైన అవగాహన లేకనో..? లేక ఇంకుడు గుంత నిర్మించకపోవడమో..? మరే కారణమోగానీ మున్సిపాలిటీల్లోనే ఆ నిధులు మూలుగుతున్నాయి. జగిత్యాల మున్సిపాలిటీలో గతేడాది 650 ఇళ్ల నిర్మాణాలు జరుగగా.. ఇంటికి రూ.2వేల చొప్పున నిధులు బల్దియాలోనే మూలుగుతున్నాయి. ఇలా ఏటా రూ.లక్షల్లో ఇంకుడుగుంతల ఫీజు అలానే ఉండిపోతోంది. గతంలో వీటి నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

నిర్వహణ ఎక్కడ..?

2018లో ప్రభుత్వం ప్రతి జిల్లా కార్యాలయంలో ఇంకుడుగుంతలు ఉండాలని ప్రత్యేక నిధులు మంజూరుచేయగా.. ప్రతి కార్యాలయంలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. కానీ నిర్లక్ష్యంతో అవి కాస్త మరుగున పడిపోయాయి. ప్రతి మున్సిపాలిటీతోపాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్మించగా పిచ్చిమొక్కలు, పూడికతో నిండిపోయాయి. తాత్కాలికంగా మరమ్మతు చేపడితే ఇంకుడు గుంతలు ఉపయోగంలోకి వచ్చే అవకాశాలుంటాయి.

ఇంకుడుగుంత నిర్మించుకోవాలి



ఇంకుడు గుంతల నిర్మాణంపై సర్వే చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయి. వర్షం నీటితోపాటు ప్రతిరోజూ వినియోగించుకునే నీటిని పొదుపుచేసుకోవాలి. ఇది ఇంకుడుగుంతతోనే సాధ్యం. గుంత నిర్మించుకుంటే నీటి ఎద్దడిని నివారించవచ్చు.

– అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్

ఇంకుడు గుంతలతో మేలు

ఇంకుడుగుంతల నిర్మాణాలతో భూగర్భజలాలు పెంపొందించుకునే అవకాశాలుంటాయి. ప్రతి చోటా ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపడితే వర్షకాలంలో వృథాజలాలు సాధ్యమైనంత మేర భూమిలోకి ఇంకి తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ప్రభుత్వం దీనిపై ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

మొదటి రోజు రెండు నామినేషన్లు



విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న భూక్యా నందునాయక్

నిజామాబాద్‌నాగారం: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. నిజామాబాద్ స్థానానికి మొదటి రోజు రెండు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా నిజామాబాద్ నగరానికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి రాపెల్లి సత్యనారాయణ, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థిగా జగిత్యాల జిల్లాకు చెందిన భుక్యా నందునాయక్ నామినేషన్ వేశారని తెలిపారు.



స్వతంత్ర అభ్యర్థిగా రాపెల్లి సత్యనారాయణ నామినేషన్

వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలం సోమన్‌పల్లిలో శ్రీరామచంద్రస్వామివారి రథోత్సవాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రధానవీధుల మీదుగా శోభాయాత్ర చేపట్టారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. హనుమాన్‌దీక్షపరులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎర్ర గంగసాగర్, ముమ్మారి శ్రీనివాస్, కుందారపు అంజన్న, మల్యాల లక్ష్మణ్, గోనె గంగారెడ్డి, వడ్లూరి అఖిల్, శ్రావణ్, జొన్నల వినోద్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో నిఘా పటిష్టం

- జిల్లాలో ఏడుచోట్ల ఏర్పాటు
- నామినేషన్ల నేపథ్యంలో నిఘా పెంపు
- రూ.70,56,590 నగదు..
- 1,581 లీటర్ల మద్యం స్వాధీనం



జగిత్యాల టవర్‌సర్కిల్ వద్ద వ్యాపారుల నుంచి నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు

జగిత్యాలక్రైం: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో జిల్లా పోలీసు శాఖ అలర్ట్ అయ్యింది. అంతర్ జిల్లా సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు చేపట్టేలా చెక్‌పోస్టుల ఏర్పాటు చేశారు. ఇతర జిల్లాల నుంచి రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యే వరకూ జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ద్వారా ప్రతి వాహనాన్ని తనిఖీ చేయనున్నారు. ఇందుకు పోలీసులు, ఎన్నికల ప్రత్యేక బృందాలు కృషి చేస్తున్నాయి.

ఏడు చెక్‌పోస్టులు

జిల్లా సరిహద్దులో పోలీస్‌శాఖ ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. మెట్‌పల్లి శివారులోని గండి హనుమాన్ దేవాలయం వద్ద, రాయికల్ మండలం బోర్నపల్లి బ్రిడ్జి వద్ద, మల్లాపూర్ మండలం ఒబులాపూర్ బ్రిడ్జి వద్ద, బీర్‌పూర్ మండలం కమ్మునూర్ వద్ద, ధర్మపురి మండలం రాయపట్నం వద్ద, కొడిమ్యాల మండలం దొంగలమర్రి వద్ద, కథలాపూర్ మండలం కలికోట వద్ద పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటలపాటు తనిఖీలు చేపడుతున్నారు. అలాగే జిల్లాలో అదనంగా మరో 9 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు.

పోలీస్‌స్టేషన్ల పరిధిలో తనిఖీలు

అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర వస్తువులను తరలించి ఓటర్లను ప్రలోభపెట్టకుండా ప్రతిపోలీస్‌స్టేషన్ పరిధిలో రోజు పోలీసులు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆధారాలు లేకుండా డబ్బు, ఇతర ఇతర వస్తువులు తరలిస్తే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నారు.

నగదు పట్టివేత..

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా రూ.70,56,950 నగదు, రూ.8,17,950 విలువైన 1581 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే రూ.3.95 లక్షల విలువైన 15.81 కిలోల గంజాయి, రూ.5,59,858 విలువైన ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం



ఎన్నికల కోడ్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నాం. ఇప్పటి వరకు రూ.70,56,590 నగదు, రూ.8,17,950 విలువైన 1581 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నాం. అంతర్ జిల్లా, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేసేందుకు జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. చెక్‌పోస్టుల్లో సిబ్బంది 24 గంటల పాటు తనిఖీలు చేపడుతున్నాం.

– సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ

మద్యం విక్రయాలపై నిఘా



మద్యం విక్రయాలపై నిఘా పటిష్టం చేశాం. మార్చి 10 నుంచి ఈనెల 17 వరకు 105 గుడుంబా నేరాలను గుర్తించి 17 మందిని అరెస్ట్ చేశాం. మద్యం విక్రయిస్తే జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ 87126 58823, జగిత్యాల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 87126 58824, ధర్మపురి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 87126 58825, మెట్‌పల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 87126 58826లో ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. – సత్యనారాయణ, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

పెద్దపల్లిలో కాంగ్రెస్ గాలి వీస్తోంది

- బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం
- ధర్మపురి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు



ధర్మపురిలో ప్రసంగిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ధర్మపురి: అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం కాంగ్రెస్ వశమైందని, అదే ఊపుతో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజార్టీ ఇవ్వాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం దొంగ దీక్షలు చేపడుతున్న ఈశ్వర్ తీరును ప్రజలు గమనించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో గడ్డం వంశీకృష్ణకు 50వేల మెజారిటీ వచ్చేలా కార్యకర్తలు కంకణం కట్టుకోవాలన్నారు. ఎమ్మెల్సీ, నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు శాయాశక్తులా కృషి చేస్తామని పెద్దపల్లి, రామగుండం, చెన్నూర్, మంచిర్యాల ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్, గడ్డం వివేక్, ప్రేమ్‌సాగర్‌రావు, కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తకు ఫిట్స్..

మంత్రి శ్రీధర్‌బాబు ప్రసంగిస్తున్న సమయంలో ఓ కాంగ్రెస్ కార్యకర్తకు ఫిట్స్ రావడంతో కింద పడిపోయాడు. వెంటనే మంత్రి ప్రసంగాన్ని ఆపివేశారు. విప్ లక్ష్మణ్ అతడిని ఆస్పత్రికి తరలించారు.

బీఫాం అందుకున్న బాజిరెడ్డి గోవర్ధన్



కేసీఆర్ నుంచి బీఫాం అందుకుంటున్న బాజిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్‌పర్సన్, నాయకులు

జగిత్యాల: నిజామాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేతులమీదుగా గోవర్ధన్ బీఫాం అందుకున్నారు. సంజయ్ మాట్లాడుతూ.. గోవర్ధన్‌ను భారీమెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ ఎమ్మెల్యేలు గణేశ్‌గుప్తా, జీవన్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పాల్గొన్నారు.

పార్టీ విజయానికి పాటుపడాలి



రాయికల్: జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఆర్‌ఎంపీలు

రాయికల్/సారంగాపూర్/మెట్‌పల్లి: కాంగ్రెస్ అభ్యర్థి అయిన తన గెలుపునకు కార్యకర్తలు అండగా ఉండాలని నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ పట్టణ ఆర్‌ఎంపీలు జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించాలన్నారు. ఆర్‌ఎంపీలు అస్లాం, దాసరి గోవర్ధన్, బైరి సుకేశ్, సద్దుల సంతోష్, దాసరి విద్యాసాగర్, పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్ పాల్గొన్నారు. సారంగాపూర్ మండలం రేచపల్లి మాజీ సర్పంచ్ ఎడమల జయ, లక్ష్మారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఈనెల 22న నామినేషన్ కార్యక్రమానికి భారీగా జన సమీకరణ చేయాలన్నారు. విండో చైర్మన్ ఏలేటి నర్సింహ్మారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భూక్య సరళ, ఎడమల శైలేందర్‌రెడ్డి, బేర మహేశ్ పాల్గొన్నారు. మెట్‌పల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బర్ల సాయన్న తన అనుచరులతో కాంగ్రెస్‌లో చేరగా జీవన్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం చెప్పినా బీఆర్‌ఎస్, బీజేపీ రాద్ధాంతం చేస్తున్నాయన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- డీఈవో జగన్మోహన్‌రెడ్డి



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న డీఈవో

జగిత్యాల: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలి డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. వెల్గొండ జెడ్పీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల నమోదుకు హెచ్‌ఎంలు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేసి విద్యార్థుల అభివృద్ధికి ప్రయత్నిస్తే ప్రభుత్వ పాఠశాలలో నమోదులు పెరుగుతాయని పేర్కొన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు, వెల్గొండ హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, దశరథరెడ్డి, శ్రీనివాస్, కిరణ్ పాల్గొన్నారు.

మోదీ పథకాలతో నిరుపేదలకు లబ్ధి



బీర్‌పూర్‌లో మాట్లాడుతున్న బోగ శ్రావణి

సారంగాపూర్: ప్రధాని నరేంద్రమోదీ అమలు చేసిన సంక్షేమ పథకాలతోనే నిరుపేద, మధ్యతరగతి ప్రజలు లబ్ధి పొందుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. బీర్‌పూర్ మండలంలోని బీర్‌పూర్, నర్సింహులపల్లె, తుంగూర్‌లో మహిళలతో కలిసి శక్తివందన్ కార్యక్రమం పేరిట ప్రచారం నిర్వహించారు. మోదీ ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, ఉజ్వల గ్యాస్ కనెక్షన్, కిసాన్ సన్మాన్ యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలతో మధ్యతరగతి, పేదవర్గాలకు లాభం జరుగుతుందన్నారు. నిజామాబాద్‌కు పసుపుబోర్డు తెచ్చిన ధర్మపురి అర్వింద్‌ను గెలిపించుకోవాలని సూచించారు. ఆమె వెంట బీర్‌పూర్ జెడ్పీటీసీ పాత పద్మ, మాజీ సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, నాయకులు ఆడెపు నర్సయ్య, బూట్ల మార్కండేయ, బసవరాజుల సంతోష్, బోరే నగేష్, ఉయ్యాల స్వామి, ఆడెపు వెంకటేష్; ఆడెపు వినయ్, మెరుగు గంగాధర్, పెడాల గంగన్న ప్రతాప్ తదితరులు ఉన్నారు.

దిగుబడి అంచనాకు పంటకోత ప్రయోగం

- రాష్ట్ర అర్థగణాంక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి



వరి పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్: పంట దిగుబడి అంచనా వేసేందుకు వరిలో కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అర్థగణాంక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి అన్నారు. మెట్‌పల్లి మండలం మేడిపల్లిలో గురువారం వరి పంటకోత ప్రయోగం నిర్వహించారు. గ్రామానికి చెందిన లోక గంగాధర్ (ఎంటీయూ 1010) దొడ్డు రకాన్ని సాగు చేశాడు. ఆ పంటను ఎంపిక చేసిన అధికారులు.. పావుగుంట విస్తీర్ణంలో వరిని కోసి ప్రయోగం చేశారు. ఇందులో 18.950 కిలోల ధాన్యం దిగుబడి వచ్చినట్లు గుర్తించారు. పంట కోత ప్రయోగాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, తద్వారా యాసంగి–2024కు సంబంధించిన పంట దిగుబడి అంచనా వేస్తున్నామని వివరించారు. పంటకోత ప్రయోగాలు పర్యవేక్షకుల సమక్షంలోనే జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మనోజ్ఞ, గణాంక అధికారులు మల్లేశం, శ్యాంసుందర్, నాగేష్, రామకృష్ణ, మధు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



రామడుగు(చొప్పదండి): సివిల్స్ 27వ ర్యాంకర్, రామడుగు మండలంలోని వెలిచాలకు చెందిన నందాల సాయికిరణ్ గురువారం స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో స్వామివారి నిత్య కల్యాణోత్సవానికి హాజరై, పూజలు చేశారు. మాజీ సర్పంచ్ వీర్ల సరోజన ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. అలాగే, సాయికిరణ్ ఐదోతరగతి వరకు చదివిన వెలిచాల సరస్వతి పాఠశాలలో స్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్, కో–కరస్పాండెంట్ ఉప్పుల సత్యం, తేజ స్కూల్ కరస్పాండెంట్ దేవేందర్‌రావు, సామాజిక కర్త కల్లేపల్లి పర్శారాం, మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్‌రావు, నాయకులు సత్కరించారు.

సీపీఆర్‌పై విద్యుత్ సిబ్బందికి అవగాహన



కొత్తపల్లి(కరీంనగర్): టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యుత్ సిబ్బందికి గుండెపోటు నుంచి ప్రాథమికంగా ప్రాణాలు రక్షించుకునే సీపీఆర్ విధానంపై డాక్టర్ ప్రణవ్ గురువారం అవగాహన కల్పించారు. ఎస్ఈ గంగాధర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు. గుండె నొప్పి వస్తే వైద్యులు సూచించినట్లు ప్రథమ చికిత్స చేయాలని సూచించారు. డీఈలు విజయేందర్ రెడ్డి, రాజం, తిరుపతి, ఏడీఈలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, మల్లేశం, పురుషోత్తం, పీవో చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత



జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని టవర్ సర్కిల్ ప్రాంతంలో గురువారం ఉదయం జగిత్యాల పట్టణ ఎస్సై మన్మదరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అరుణ్ అనే వ్యక్తి వద్ద నుంచి రూ.7.20 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

తహసీల్ చౌరస్తాలో..


జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో పట్టణ ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. మల్యాల మండలంలోని గొర్రెగుండంకు చెందిన బైరవేని రాజు వద్ద రూ.99,500, పురాణిపేటకు చెందిన ఆవారి సందీప్ వద్ద రూ.1.16 లక్షలు పట్టుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకుడిని కాపాడిన లేక్ పోలీసులు

కరీంనగర్ క్రైం: మానేరు డ్యాంలో దూకేందుకు వెళ్తున్న ఓ యువకుడిని కరీంనగర్ లేక్ పోలీసులు కాపాడారు. వారి వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలానికి చెందిన ఎం.శ్రీనివాస్ కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురయ్యాడు. గురువారం ఆత్మహత్య చేసుకునేందుకు కరీంనగర్ వచ్చాడు. మానేరు డ్యాంలో దిగుతుండగా లేక్ పోలీసులు గుర్తించి, బయటకు తీసుకువచ్చారు. అతని కుటుంబసభ్యులను పిలిపించి, కౌన్సెలింగ్ చేసి, పంపించారు.

కీలక అవయవం.. కాలేయం

- జీవ, జీర్ణక్రియల్లో తోడ్పాటు
- జీవితాంతం పెరిగే ఒకే ఒక్క అవయవం
- కాపాడుకుంటే ఆయుష్షు పెరిగినట్లే..
- నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం



కరీంనగర్‌టౌన్: శరీరంలో జరిగే జీవ, జీర్ణక్రియల్లో కాలేయం ముఖ్య పాత్ర పోషిస్తుంది. నిరంతరం ఒక కెమికల్ ఫ్యాక్టరీ లాగా శరీరంలో పని చేస్తుంది. విషపదార్థాలను బయటకు పంపడంలో ఇది కీలకం. శరీరంలోని అతి పెద్ద గ్రంథి కాలేయం. మెదడు తర్వాత అతి ముఖ్యమైన అవయవం. రక్తంలో ఉండే బ్యాక్టీరియా, హానికర హార్మోన్లను తొలగిస్తుంది. అలాగే, జీవితాంతం పెరిగే ఒకే ఒక్క అవయవం కూడా ఇదే. రోగనిరోధక శక్తికి దోహదం చేస్తుంది. దీన్ని కాపాడుకుంటే ఆయుష్షు పెరుగుతుంది. కాలేయం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, సంబంధిత వ్యాధుల గురించి అవగాహన కల్పించడానికి ఏటా ఏప్రిల్ 19ని ప్రపంచ కాలేయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా కథనం.

రక్తాన్ని వడిపోయడం..

మన శరీరంలోని జీర్ణకోశ నాళం నుంచి వచ్చే రక్తాన్ని వడపోయడం, ఆహారం ద్వారా వచ్చే రసాయనాలు, వాటిలోని విషపదార్థాలను నిర్మూలించడం, ఇన్ఫెక్షన్లు, కొవ్వులు, రక్తంలోని చక్కెర స్థాయిలను లివర్ నియంత్రిస్తుంది. ఏది తిన్నా, తాగినా కాలేయం ద్వారానే వెళ్తాయి. కొన్ని ఆహారాలు లివర్ ఆరోగ్యానికి మేలు చేస్తే.. మరికొన్ని దెబ్బ తీస్తాయి. అందుకే తీసుకునే ఆహారంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

హాని కలిగించే ఆహారాలు..

వైట్ రైస్, తెల్ల రొట్టె, చక్కెర, ఉప్పు వంటివి కాలేయం ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ఉప్పు, మైదాతో (రిఫైన్డ్ ఫ్లోర్) తయారు చేసిన పాస్తా, పిజ్జా, బిస్కెట్లు, వైట్ బ్రెడ్ లాంటి ఆహార పదార్థాలు, మీగడ పాలు, ఐస్‌క్రీమ్, చీజ్ వంటి అధిక కొవ్వుతో ఉన్న పాల ఉత్పత్తులకు దూరంగా ఉంటే మంచిది.

కూరగాయలు, పండ్లు తీసుకోవాలి



గతంతో పోలిస్తే కాలేయ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయి. లివర్ దెబ్బతింటే హైపటైటిస్ ఇన్‌ఫెక్షన్లతోపాటు పుట్టుకతో సంక్రమిస్తున్న, జన్యుపరమైన వ్యాధులు, ఫ్యాటీ లివర్ ప్రాణాంతకంగా మారుతున్నాయి. కాలేయాన్ని కాపాడుకోవాలంటే కూరగాయలు, పండ్లు, ఫైబర్ శాతం ఎక్కువగా ఉండే పదార్థాలు తీసుకోవాలి. మద్యం మానేయడం, మసాలాలు, చల్లటి వస్తువులు, వేపుళ్లు తినకుండా ఉండటం, పులుపు పదార్థాలు తగ్గించి, బరువును నియంత్రణలో ఉంచుకోవడం వంటివి చేయాలి.
– డాక్టర్ దిలీప్‌రెడ్డి, సర్జికల్ గ్యాస్ట్రో, మెడికవర్ ఆసుపత్రి

విటమిన్–సి చాలా అవసరం

ఆకు కూరలు, వెల్లుల్లి, బంగాళదుంప, బీట్ రూట్, క్యారెట్ లాంటి దుంపకూరలు కాలేయంలోని కణాల పునరుత్పత్తికి బాగా సహాయపడతాయి. లివర్‌ను రక్షించుకునేందుకు విటమిన్–సి అధికంగా లభించే ద్రాక్ష, ఆపిల్, నిమ్మరసం చాలా అవసరం. వీటితోపాటు వ్యాయామం చేయాలి.

అవినీతి సొమ్ము పార్టీలకిస్తే నీతిమంతమవుతుందా?

- ఎలక్ట్రోబాండ్ల పేరుతో అవినీతికి మోడీ ప్రోత్సాహం
- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కార్పొరేషన్: అవినీతి డబ్బులను పార్టీలకు విరాళాలుగా ఇస్తే ఆ సొమ్ము నీతిమంతమవుతుందా అని బీసీ సంక్షేమ,రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీ నాయకులను ప్రశ్నించారు. ఎలక్ట్రో బాండ్లను బీజేపీ సమర్థించుకోవడం సరికాదని, భవిష్యత్‌లో ఇది ఇబ్బందికరంగా మారుతుందని హెచ్చరించారు. గురువారం కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎలక్ట్రో బాండ్ల ద్వారా బీజేపీ క్విడ్‌ప్రోకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎలక్ట్రోబాండ్ల ద్వారా అవినీతి సొమ్మును తీసుకుంటున్న ప్రధాని నరేంద్రమోడీ పరోక్షంగా అవినీతిని ప్రోత్సహించినట్లే అన్నారు. లిక్కర్‌స్కాంలో నిందితుడు శరత్‌చంద్రకు బెయిల్ రావడానికి, రూ.500 కోట్ల బాండ్లు బీజేపీకి ఇచ్చారని తెలిపారు. ఇదే క్విడ్ ప్రోకు ఉదాహరణ అని తెలిపారు. సీఎం బీజేపీలో కలుస్తారని, ఆర్ ట్యాక్స్ అంటూ పనికిరాని మాటలు మాట్లాడుతున్నారని, తమ ప్రభుత్వం మాత్రం పనిచేసుకుంటూ ముందుకు పోతున్నామన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ఇబ్బందుల్లో ఉందని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రజలు కాంగ్రెస్‌తో కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

మంత్రికి న్యాయవాదుల ఆత్మీయ సన్మానం

కరీంనగర్‌క్రైం: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, న్యాయవాది పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను గురువారం కరీంనగర్ జిల్లా బార్ అసోసియేషన్ కార్యవర్గం, న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్ల స్థలాల కోసం 20 ఎకరాలు, న్యాయవాదుల కాన్ఫరెన్స్ హాల్ నిర్మాణానికి 5 ఎకరాలు, హెల్త్‌కార్డుల పరిమితి రూ.2లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని, కొత్తగా వచ్చిన న్యాయవాదులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5 వేలు చొప్పున ఐదేళ్ల పాటు ఇవ్వాలని కోరగా పరిశీలిస్తానని మంత్రి తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రఘువీర్, కార్యదర్శి బీమాసాహెబ్, కోశాధికారి రామగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లారీలో ఉన్నవి పీడీఎస్ బియ్యమే

- ల్యాబ్ పరీక్షలో నిర్ధారణ
- 350 క్వింటాళ్ల బియ్యం సీజ్, ముగ్గురిపై 6ఏ కేసు

హుజూరాబాద్: పట్టణంలోని పరకాల క్రాస్ రోడ్ వద్ద ఈ నెల 10వ తేదీన పోలీసులు పట్టుకున్న బియ్యం పీడీఎస్ రైస్‌గా నిర్ధారణ అయ్యాయని సివిల్ సప్లయ్ డీటీ వసంతరావు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. పరకాలలోని ఓ మిల్లు నుంచి పీడీఎస్ బియ్యాన్ని జైశ్రీరామ్ పేరుతో ఉన్న సంచుల్లో నింపి, హుజూరాబాద్ మీదుగా గుజరాత్‌కు లారీలో తరలిస్తుండగా పోలీసులు అనుమానించి పట్టుకున్నారని పేర్కొన్నారు. 11న తమకు అప్పగించగా బియ్యం శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించామన్నారు. రిపోర్టులో 6 నెలల కిందటి పీడీఎస్ రైస్‌గా తేలాయన్నారు.



బియ్యాన్ని సివిల్ సప్లయ్ గోదాంలో దించుతున్న హమాలీలు

దీంతో గురువారం రైస్‌మిలు యజమాని, లారీ డ్రైవర్, క్లీనర్‌లపై 6ఏ కేసు నమోదు చేశామని తెలిపారు. లారీలోని 350 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి, హుజూరాబాద్ పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించి, భద్రపరిచినట్లు పేర్కొన్నారు. అయితే, బియ్యాన్ని గుజరాత్ తరలించేందుకు ప్రయత్నించారన్న అంశం స్థానికంగా చర్చనీయాంశమైంది.

గంజాయి మాయం కేసులో ఇద్దరు ఎస్సైల సస్పెన్షన్

- హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ కూడా..

జగిత్యాలక్రైం/సారంగాపూర్: జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు పట్టుకున్న 70 కిలోల గంజాయి మాయమైన కేసులో బాధ్యులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. విధుల్లో అలసత్వం వహించిన వారిపై ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మల్టీజోన్–1 ఐజీ ఏవీ రంగనాథ్‌కు నివేదిక అందజేశారు. దీంతో సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో గతంలో పని చేసిన ఎస్సై మనోహర్‌రావు, ప్రస్తుత ఎస్సై తిరుపతి, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుల్ నరేందర్‌లను సస్పెండ్ చేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన 'కోడి పంచాయితీ'

- రూ.30వేల విలువైన భీమవరం జాతి కోడి చోరీ

జగిత్యాలక్రైం: తాము పెంచుకున్న భీమవరం జాతి కోడిని దొంగిలించారని సదరు కోడి యజమాని, జగిత్యాల జిల్లాకేంద్రంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన కర్క శివనాగరాజు గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాని విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని పేర్కొన్నారు. విచారణ చేపట్టిన పోలీసులు నాగేంద్రనగర్‌కాలనీకి చెందిన నాగరాజు వద్ద కోడి ఉన్నట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. నాగరాజు పోచమ్మవాడకు చెందిన ఎల్లేశ్ అనే వ్యక్తి నుంచి రూ.3 వేలకు కొనుగోలు చేసినట్లు పోలీసుల ముందు ఒప్పుకున్నాడు. నాగరాజు కోడిని తెచ్చి శివనాగరాజుకు అప్పగించాలని పోలీసులు సూచించగా.. నాగరాజు కుటుంబసభ్యులు నిరాకరించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

రౌడీ షీటర్ల బైండోవర్

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రేకుర్తి గ్రామానికి చెందిన ఐదుగురు రౌడీషీటర్లను గురువారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

సాయ్ హ్యాండ్‌బాల్ అకాడమీకి ఎంపిక



సంజీవ్ ఈశ్వర్ చంటి దేవేందర్ వంశీ

కరీంనగర్ స్పోర్ట్స్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు చెందిన కర్నూల్‌లోని హ్యాండ్‌బాల్ అకాడమీకి ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఐదుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ గురువారం తెలిపారు. సంజీవ్, ఈశ్వర్(రామడుగు), చంటి, దేవేందర్(కాటారం), వంశీ(గుల్లకోట) ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులను సంఘం సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, కోచ్ వెంకటేశ్ అభినందించారు.

'కార్పొరేట్ కళాశాలల స్కీంకు దరఖాస్తు చేసుకోండి'

కరీంనగర్: 2024–25 విద్యా సంవత్సరానికి గానూ రెప్యుటెడ్(కార్పొరేట్) జూనియర్ కళాశాలల స్కీంకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నేతానియల్ ఒక ప్రకటనలో తెలిపారు. రెప్యుటెడ్ స్కీం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, అంధ విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలల్లో అడ్మిషన్లు కల్పించనున్నామన్నారు. కొత్తగా జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీలను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. రెసిడెన్షియల్ వసతి కలిగి, విద్యాబోధన సాగించే అర్హత గల కళాశాలలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యాజమాన్యాలు ఐదేళ్లకు సంబంధించిన అకాడమిక్ ప్రొఫైల్‌తోపాటు ఈ–పాస్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 27లోగా అన్ని వివరాలతో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఎంపికైన కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏటా ట్యూషన్ ఫీజు కింద ఒక్కొక్కరికి రూ.35 వేలు, పాకెట్ మనీ కింద రూ.3 వేలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- బస్సు డ్రైవర్, కండక్టర్, ప్రయాణికులకు గాయాలు



గంగాధర(చొప్పదండి): వ్యాన్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పలువురు గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున గంగాధర మండలంలోని కురిక్యాల శివారు వరద కాలువ సమీపంలో ఓ వ్యాన్‌ను ఇండికేటర్లు వేయకుండా నిలిపి ఉంచారు. అదే సమయంలో వెనక వైపు నుంచి వచ్చిన కోరుట్ల డిపోకు చెందిన బస్సు ఆ వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్, కండక్టర్‌తోపాటు పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, బాధితులను ఆస్పత్రికి తరలించారు. కోరుట్ల డిపోకు చెందిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌రెడ్డి తెలిపారు.

'మృతదేహం ప్రకాశం జిల్లా వాసిది'

మానకొండూర్: మండలంలోని ఈదులగట్టెపల్లి ఎస్సారెస్పీ కాకతీయ కాలువ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన విషయం విదితమే. అయితే, అది ప్రకాశం జిల్లా దొనకొండ మండలం భూమనపల్లికి చెందిన మురికిపూడి చిన్న చెన్నయ్య(36)దిగా గుర్తించామని మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్ గురువారం తెలిపారు. అతను కరీంనగర్‌లో ఉంటున్న ప్రకాశం జిల్లాకే చెందిన తన్నీరు శ్రీనివాస్ వద్దకు 10 రోజుల క్రితం మేస్త్రీ పని కోసం వచ్చాడన్నారు. కానీ, తాగుడుకు బానిసై, పనికి వెళ్లకుండా తిరుగుతున్నాడని తెలిపారు. ఇదే విషయాన్ని శ్రీనివాస్ చిన్న చెన్నయ్య తల్లిదండ్రులకు చెప్పాడన్నారు. ఎండదెబ్బ తగిలి చనిపోయి ఉంటాడని మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యవసాయ బావిలో పడి బాలిక మృతి

- మృతురాలి స్వస్థలం నెల్లూరు జిల్లా కందుకూరు

వీణవంక(హుజూరాబాద్): వ్యవసాయ బావిలో పడి, ఓ బాలిక మృతిచెందింది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన దేవరకొండ శ్రీనివాస్ భార్య, కూతురితో కలిసి వీణవంక మండలంలోని గంగారం గ్రామానికి వచ్చాడు. వీరు స్థానికంగా బాతులను మేపుతున్నారు. ఈ క్రమంలో గురువారం శ్రీనివాస్ కూతురు పార్వతి(13) ఎండవేడికి తట్టుకోలేక మంచినీళ్ల కోసం వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. నీరు తాగేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి, మునిగిపోయింది. గ్రామస్తులు, కుటుంబసభ్యులు గమనించి, పోలీసులకు సమాచారం అందించడంతో వచ్చి, మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

కరీంనగర్‌రూరల్: ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్‌రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రూరల్ మండలంలోని ఆరెపల్లికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గంట్ల గోపాల్‌రెడ్డికి ఇద్దరు కుమారులున్నారు. చిన్న కుమారుడు మనీశ్‌రెడ్డి(31) హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నాడు. బుధవారం తల్లిదండ్రులు కంటి వైద్యం కోసం వరంగల్ వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటలకు సమీపంలోని పెద్దనాన్న ఇంట్లో భోజనం చేసి, ఇంటికి వచ్చిన మనీశ్‌రెడ్డి ఉరేసుకున్నాడు. గురువారం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు తలుపులు కొట్టగా తీయలేదు. పగులగొట్టి చూడగా లోపల ఉరేసుకొని కనిపించాడు. మానసిక స్థితి సరిగా లేక, జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మనీశ్‌రెడ్డి రాసిన సూసైడ్ నోట్ దొరికింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

montessori GROUP OF SCHOOLS HUZURABAD

We are hiring qualified and well experienced teachers for all classes. Fluency in English is mandatary. Salary is not a constraint for the deserving candidates.

Interested candidates can share their Resume to the given numbers before date: 19-04-2024.

Contact No: 9393557753, 7032657751.

హార్వెస్టర్‌లో పడి, తెగిన రైతు చేయి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని ఇదులాపూర్ గ్రామంలో వంగళ సదాశివ రెడ్డి అనే రైతు చేయి తెగిపడింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. సదాశివరెడ్డి గురువారం హార్వెస్టర్‌తో తన వరి పొలం కోయిస్తున్నాడు. ఆ సమయంలో ఆయన కుడి చేయి, ప్రమాదవశాత్తు హార్వెస్టర్‌లో పడి, తెగిపోయింది. తీవ్ర రక్తస్రావమై, బాధితుడు స్పృహ కోల్పోయాడు. చుట్టుపక్కల ఉన్న రైతులు నీళ్లు చల్లడంతో తేరుకున్నాడు. కుటుంబసభ్యులు అతన్ని కరీంనగర్ ఓ ఆస్పత్రికి తరలించారు.



30 కిలోల బొచ్చె చేప

బోయినపల్లి(చొప్పదండి): రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాక సమీపంలోని మిడ్‌మానేరు ప్రాజెక్టులో గురువారం ఓ మత్స్యకారుడికి 30 కిలోల బొచ్చె చేప పడింది. కొదురుపాక పాత గ్రామ పరిసరాల్లోకి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లగా అనిల్ వలకు భారీ చేప చిక్కింది. దాన్ని ముగ్గురు మత్స్యకారులు కలిసి బయటకు తీసుకొచ్చారు.

సూక్ష్మ సేద్యం.. ఎప్పుడు మోక్షం?

- పథకం కింద ఆరేళ్లుగా రాని బిందు, తుంపర పరికరాలు
- కేవలం పండ్ల తోటలకు అందజేత
- ప్రైవేట్‌లో అధిక ధరలతో దోపిడీ
- ఉమ్మడి జిల్లా రైతుల నిరీక్షణ

కరీంనగర్ అర్బన్: సూక్ష్మ సేద్యం అందని ద్రాక్షగా మారింది. నీటి పొదుపుతోపాటు పర్యావరణానికి ఇతోధికంగా దోహదపడే ఈ సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఆరేళ్లుగా సూక్ష్మ సాగునీటి పథకం కింద బిందు, తుంపర పరికరాలకు ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదు. చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీ ఉండగా ఐదెకరాలకు పైగా ఉన్న వారికి 80 శాతం రాయితీపై పరికరాలను పంపిణీ చేసేవారు. ప్రస్తుతం పండ్ల తోటలు సాగు చేసుకునే రైతులకు మాత్రమే అందిస్తుండగా ఇతరులకు రిక్తహస్తమే ఎదురవుతోంది.

2003లో పథకం ప్రారంభం

2003 నుంచి సూక్ష్మ సాగునీటి పథకం అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఉమ్మడి జిల్లాలో 30 వేల ఎకరాల్లో బిందు, తుంపర సేద్యం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన దరిమిలా బిందు సేద్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించింది. రైతులు కూడా కరువు కాటకాల నుంచి పంటలను కాపాడుకునేందుకు బిందు సేద్యంపై మొగ్గు చూపుతున్నారు. ఉద్యాన శాఖ కార్యాలయానికి వేలాదిగా దరఖాస్తులు రావడంతో పరికరాల కేటాయింపునకు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం అర్జీ పెట్టుకున్న రైతుకు కూడా అందించే పరిస్థితి లేదు. ఇప్పుడున్న దరఖాస్తులను పరిశీలిస్తే పరికరాలను అందుకోడానికి మరో ఐదేళ్ల వరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి.



బిందు పరికరాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

నిధుల కేటాయింపు అరకొర

సూక్ష్మసేద్యం ద్వారా పంటలు సాగు చేసేందుకు ఉమ్మడి జిల్లా రైతులు సిద్ధంగా ఉన్నారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో అన్నదాతలకు బిందు, తుంపర పరికరాలు అందడం లేదు. 2014–15 సంవత్సరంలో 1,500 హెక్టార్లలో బిందు పరికరాలు అందించేందుకు రూ.12 కోట్లు, 432 హెక్టార్లలో తుంపర పరికరాలకు రూ.1.20 కోట్లు మంజూరు చేసింది. 2015–16 సంవత్సరంలో 1,152 హెక్టార్లలో బిందు పరికరాలకు రూ.8.36 కోట్లు, 616 హెక్టార్లలో తుంపర పరికరాలకు రూ.88 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులు ఎటూ సరిపోలేదు. అప్పటికే వేలాది మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ విస్తృత ప్రచారంతో 2016–17 సంవత్సరానికి గానూ 2,500 మంది అర్జీ పెట్టుకున్నారు. దరఖాస్తుల లెక్క ప్రకారం 21 వేల హెక్టార్లలో బిందు సేద్యం సాగవ్వాల్సి ఉంది. ఈ పరికరాలకు సుమారు రూ.60 కోట్లు అవసరమవుతాయని అధికారుల అంచనా. 2,231 హెక్టార్లలో తుంపర పరికరాల కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వీటికి మరో రూ.5 కోట్లు అవసరమవుతాయి. ప్రభుత్వం కేవలం రూ.26 కోట్లు మంజూరు చేసింది. 2018 నుంచి కేటాయించక పోవడంతో రైతులకు నిరీక్షణ తప్పడం లేదు.

బిందు, తుంపర సేద్యంతో ఆదా ఇలా

అంశం	ఎంత శాతం
నీరు	43.8
విద్యుత్	33
పంట ఉత్పాదకత	52.30

జోరందుకున్న ప్రైవేటు వ్యాపారం

ప్రభుత్వ రాయితీ పడకేయడంతో ప్రైవేటు వ్యాపారం జోరందుకుంది. అధిక ధరలకుతోడు నాణ్యత లేమి, సేవలో లోపంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. మార్కెట్లో ప్రైవేటుగా బిందు, తుంపర పరికరాలను కొనుగోలు చేస్తుండటంతో ఎకరానికి సుమారు రూ.30 వేలు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో 17 కంపెనీలు బిందు సేద్య, నాలుగు కంపనీలు తుంపర సేద్య పరికరాలను సరఫరా చేస్తున్నాయి. అయితే, కొన్ని కంపెనీలు సకాలంలో స్పందిస్తుండగా మిగతావి కావాలనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పరికరాల బిగింపులో లేని నిబంధలను సాకుగా చూపి, వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ అందినకాడికి దండుకునేవారూ లేకపోలేదు. వాటి నాణ్యత కూడా అంతంతమాత్రమే కాగా, సేవలు ఐదేళ్ల వరకు ఉచితంగా అందించాల్సి ఉండగా ఆ ఊసే లేదు. అయినా విధి లేని పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు. అయితే, పండ్ల తోటలకు మాత్రమే రాయితీ బిందు, తుంపర పరికరాలు అందిస్తున్నామని, మిగతా పంటలకు ఇవ్వడం లేదని ఉద్యానవనశాఖ అధికారులు చెబుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
అద్భుత అవకాశం

■ రోజుకి 5000 నుండి 50 వేల వరకు సంపాదించుకొనే అవకాశం. విద్యార్థులు, గృహిణులు, రిటైర్డ్ ఎంప్లాయిస్ ఎల్.ఐ.సి ఏజెంట్స్, మార్కెటింగ్ పర్సన్స్ మొ॥ 9848214521. [WA-1264878]

WANTED

■ శ్రీలక్ష్మీ హోంకేర్: హైదరాబాద్ నందు వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్ ఇంటి/ వంటపనికి స్త్రీ/పు॥ కావలెను. జీతం: 17000/– రూం+మీల్స్ ఫ్రీ ✆ 9347148051 [G-1465]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

www.sakshi.com

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824